

స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

# 100 పడకల ఆసుపత్రి కొరకు స్థల పరిశీలన

**కల్వకుర్తి, జనవరి 18 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పరిశీలించారు. కల్వకుర్తి పట్టణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు నూతన ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం కొరకు అనువైన ప్రభుత్వ స్థలాన్ని గుర్తించేందుకు కలెక్టర్ కల్వకుర్తి ఆర్డీవో శ్రీను, రెవెన్యూ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భం గా కలెక్టర్ కల్వకుర్తి పట్టణంలో నీ డబుల్ బెడ్ రూమ్ సమీపంలో ఉన్న 99వ సర్వే నెంబర్లో గల 5 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఆసుపత్రి నిర్మాణానికి అవసరమైన స్థలానికి సంబంధించి విస్తీర్ణం, రోడ్డు అనుసంధానం, భౌగోళిక పరిస్థితులు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. స్థలాన్ని పునః పరిశీలించి, ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి అనువైనదిగా ఉంటే ప్రతిపాదనలను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆర్డీవోకు ఆదేశించారు. కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న 100 పడకల ఆసుపత్రిని అత్యాధునిక సదుపాయాలతో నిర్మించనున్నట్లు, ఇది స్థానిక ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడానికి దోహదపడుతుందని తెలిపారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఆసుపత్రికి కావలసిన స్థలాన్ని సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట కల్వకుర్తి ఆర్డీవో శ్రీను, రెవెన్యూ అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్



వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

## పురాతన దేవాలయాలు అభివృద్ధి

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 18 ప్రభాతవార్త:** పురాతన దేవాలయాలు బ్రహ్మాండంగా అభివృద్ధి చేసుకుందాం అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని తిరుమల దేవునిగుట్ట, వార్డు నెంబర్ 32 లోని శ్రీ రామాంజనేయ స్వామి పురాతన దేవాలయంలో రూ.10లక్షల నిర్మించనున్న షెడ్, స్టేర్ కేస్ కోసం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ మన మహబూబ్‌నగర్ పట్టణలో ఉన్న అతి పురాతన దేవాలయాలలో ఎలాంటి ఇక్కట్లు లేకుండా ప్రజలు నిత్యం భగవంతుని దర్శనం చేసుకొనే విధంగా అన్ని రకాల వసతులు కల్పించే ప్రయత్నం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. శ్రీ రామాంజనేయ స్వామి దేవాలయంలో వేసవిలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా స్వామివారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు షెడ్, స్టేర్ కేస్ నిర్మాణానికి నేడు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. కొత్తగా మెట్లు ప్రాంతంలో షెడ్ నిర్మాణానికి ఎస్టిమేషన్స్ తయారు చేయాలని అధికారులకు ఆయన ఆదేశాలు జారీచేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సాదత్‌అలి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, ఎఇ అంజి రెడ్డి, క్రిస్టియన్ మైనారిటీ పట్టణ అధ్యక్షులు సామ్యూల్ దాసరి, బుద్దారం సుధాకర్ రెడ్డి, గుండా మనోహర్, ఇమ్రాన్, రామాంజనేయులు, కోట రత్నం, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

## వ్యవసాయానికి యోగ్యంగా లేని భూములు గుర్తించండి

**గద్వాల, జనవరి 18 ప్రభాతవార్త :** వ్యవసాయానికి యోగ్యంగా లేని భూములను గుర్తించి వారిని రైతు భరోసా పథకానికి అనర్హులుగా గుర్తించాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ అధికారులకు ఆదేశించారు. శనివారం ఐ.డి.ఓ.సి కాన్ఫరెన్స్ హాల్ నందు రైతు భరోసా పథకం అమలుపై సంబధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, మండలాల వారీగా వ్యవసాయ భూములు, సాగు చేయలేని భూముల విస్తీర్ణం, వాటి గుర్తింపు విధానాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు భరోసా పథకానికి సంబంధించి 21 నుంచి 24 వరకు నిర్వహించే గ్రామ సభలు పక్కాగా జరిగే విధంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. సాగు జరగని భూములను క్షేత్రస్థాయిలో గుర్తించి, ఆ భూములను రైతు భరోసా పథకానికి అనర్హులుగా ప్రకటించాలని అధికారులకు సూచించారు. చెరువులు, పౌల్ట్రీ ఫారమ్‌లు ఉన్న భూములను గుర్తించి వాటిని తొలగించాలన్నారు. గ్రామ పటాలు, కాడాస్ట్రియల్ పటాల ఆధారంగా భూములను సమర్థవంతంగా గుర్తించాలన్నారు. ఈ సర్వేలో నలా కన్వర్షన్ భూములకు ప్రొసీడింగ్స్ నమోదు చేయాలి. భూ సేకరణ చేసిన భూములకు ఫైల్ నంబర్లు ఉండాలి, ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తులు లేదా లేఔట్లు ఉన్న భూములను వ్యవసాయేతర భూములుగా పరిగణించాలని, రాళ్లు, రప్పలు ఉన్న భూములకు ఫీల్డ్ విజిట్ నిర్వహించి, అవి రైతు భరోసా పథకానికి అనర్హమైన భూములుగా గ్రామ సభలో వివరించాలని అధికారులకు ఆదేశించారు. సంక్షేమ పథకాల అమలును ప్రారంభించనున్న నేపథ్యంలో మండల స్థాయి అధికారులందరూ నిబద్ధతతో పనిచేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ, ఆర్డీఓ శ్రీనివాస రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్, ఏడీఏ సంగీత లక్ష్మి, అన్ని మండలాల తహశీల్దార్లు, మండల వ్యవసాయ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

## గ్రామాలను అభివృద్ధి చేసుకుందాం

### ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకం అందాలి:ఎమ్మెల్యే మేఘా రెడ్డి

**వనపర్తి ప్రతినిధి జనవరి 18 ప్రభాతవార్త :** గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తు, ప్రభుత్వం పరంగా అందజేసే పథకాలను ప్రతి ఇంటికి చేరేలా చూస్తానని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శనివారం శ్రీ రంగాపురం మండలం తాటిపాముల గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. తాటిపాముల గ్రామంలో 70 లక్షల వ్యయంతో గ్రామంలో ప్రధాన సిసి రోడ్డు నిర్మాణం, 18 లక్షల వ్యయంతో గ్రామంలోని పాఠశాలలో నిర్మించే అదనపు గదుల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం తాను పెద్దజీత గాడిలా పని చేస్తానని అన్నారు. రానున్న ఎన్నికల్లో సైతం ప్రతి గ్రామం నుంచి సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పిటిసి, ఎంపీపీలను కాంగ్రెస్ పార్టీ వారినే గెలిపిస్తే అభివృద్ధి త్వరితగతిన అవుతుందని, ప్రతి ఒక్కరిని కాంగ్రెస్ పార్టీ బలపరిచిన వ్యక్తులను గెలిపించాలని ఆయన కోరారు. తాటిపాముల గ్రామ శివారులోనే ఒక పెద్ద ఇండస్ట్రియల్ రాబోతుందని తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల నుంచి పిఎసిఎస్ దీర్ఘకాలికరణాలు తీసుకున్న రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వన్ టైం సెటిల్మెంట్ ఓటిఎస్ వెసులుబాటును కల్పించిందని అన్నదాతలందరూ ఈ సదా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో 5లక్షల వ్యయంతో నిర్మించే సిసి రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో పెబ్బేరు మండల మార్కెట్ చైర్మన్ ప్రమోదిని రెడ్డి, వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రాములు యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీహరి రాజు, వైస్ ప్రెసిడెంట్ నరేందర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి పార్వతమ్మ, వెంకటయ్య, నాయకులు బీరం రాజశేఖర్ రెడ్డి, పిఎసిఎస్ డైరెక్టర్ వాసుదేవారెడ్డి, తహశీల్దార్, ఎంపిడిఓ, పంచాయతీరాజ్ డిఈ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

## ప్రభుత్వ పథకాల లబ్దిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలి: జిల్లా కలెక్టర్ సంతోష్

**గద్వాల, జనవరి 18 ప్రభాతవార్త :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, రేషన్ కార్డు లబ్ధిదారుల ఎంపిక కోసం క్షేత్రస్థాయి పరిశీలనలో సమగ్ర వివరాలు సేకరించాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులకు ఆదేశించారు. శనివారం ఐజా తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, రైతు భరోసా, రేషన్‌కార్డుల జారీ తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేందుకు వీలుగా నిర్వహిస్తున్న ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియను నిశితంగా పరిశీలన జరిపారు. అర్హులైన లబ్ధిదారులను ఏ ప్రాతిపదికన గుర్తిస్తున్నారు, ఏయే అంశాలను పరిగణలోకి తీసుకుంటున్నారు. సేకరించిన అంశాలను రిజిస్టర్లలో క్రమపద్ధతిలో నమోదు చేస్తున్నారా? లేదా అని తనిఖీచేసిన కలెక్టర్, అధికారులకు కీలక సూచనలు చేశారు. ప్రతీ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఫీల్డ్ వెరిఫికేషన్ వేగంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరిస్తూ సమగ్ర వివరాలను సేకరించాలని, ఆధార్ కార్డు, ప్రజాపాలన దరఖాస్తులు, సామాజిక ఆర్థిక సర్వే వివరాలతో క్షేత్రస్థాయి పరిశీలన వివరాలను సరిచూసుకోవాలన్నారు. రైతు భరోసా పథకానికి సంబంధించి నలా కన్వర్షన్, భూసేకరణ, లే అవుట్, వ్యవసాయానికి యోగ్యంగా లేని భూములను సర్వే నెంబర్ల వారీగా పరిశీలించాలని, భూభారతి (ధరణి) పోర్టల్, గూగుల్ మ్యాప్ ల ఆధారంగా వాస్తవ వివరాలను నిర్ధారణ –మిగతా4లో..



సర్వే రిపోర్ట్ లను తనిఖీ చేస్తున్న కలెక్టర్ సంతోష్

# మండలం చేయండి మహాప్రభో..

- అర్హతలు ఉన్నా పట్టింపులేదు
- గతంలో 265 రోజుల నిరాహార దీక్షలు
- తాజా, మాజీ ఎమ్మెల్యేల హామీలు నేటికీ నీటి మూటలుగానే ప్రకటనలు
- స్థానిక సంస్థల ఎన్నికలలోపు గార్లపహడ్‌ను మండలంగా చేయాలంటూ జేపీసీ వేడుకోలు



మండలం ప్రకటించాలని నిరసన తెలుపుతున్న జేపీసీ సభ్యులు, గ్రామస్తులు

**మహబూబ్‌గర్ బ్యూరో/ కోయిలకొండ, జనవరి 18 ప్రభాతవార్త:** గ్రామపంచాయతీల తీర్మానం.. 25వేల జనాభా.. ఏడుగురు ఎంపీటీసీలు..18 మంది సర్పంచులు.. 265 రోజుల దీక్షలు.. తాజా , మాజీ ఎమ్మెల్యేల హామీలు.. నిరంతరంగా నిరసనలు, సభలు, సమావేశాలు..ఈ లెక్కను సరి చేసేది ఎవరు..? సమస్య తీరేది ఎప్పుడు..? గార్ల పహడ్ మండలంగా ప్రకటన వెలువడేది ఎన్నడు..? గార్ల పహడ్ మండలం ప్రకటనపై కండ్లల్లో ఒత్తులు వేసుకొని ఎదురు చూస్తున్న జేపీసీ సభ్యులు, గ్రామస్తుల వివరణ, మండల ఏర్పాటు

**సాధ్యాసాధ్యలపై వార్త కథనం....**

అతిపెద్ద మండలం.. కోయిలకొండ మండలం 44 గ్రామ పంచాయతీలతో అతిపెద్ద మండలంగా మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్నది. 44 గ్రామపంచాయతీలు, 80 వేల జనాభా 19వేల కుటుంబాలు కలిగిన అతిపెద్ద మండలాన్ని ప్రజల సౌలభ్యం కొరకు గార్లపహాడ్‌ను మండలంగా చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. మండలంగా ప్రకటించాలని కోరుతూ గత అసెంబ్లీ ఎన్నికల కన్నా ముందు 265 రోజులు రిలే నిరాహా ర దీక్ష చేసినా మండలం ఏర్పాటు చేయలేదు. కానీ ఎన్నికల సమయంలో గత ఎన్నికల ప్రచారంలో భాగంగా గార్లపహాడ్‌లో అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి పర్ణిక రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ రెడ్డి తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల లోపల మండలం చేస్తానని మాటిచ్చా రు. అదేవిధంగా నారాయణపేట ఎన్నికల సభలో పర్ణిక రెడ్డి ప్రస్తావించిన మండలాల గూర్చి ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి సైతం సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చారు. కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయిన మండల ప్రస్తావన లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్యనే మంత్రి సీతక్క తమ నియోజకవర్గంలో ములుగు నియోజకవర్గంలో మల్లంపల్లి అనే కొత్త మండలాన్ని తెచ్చుకున్నారని తమ గ్రామాన్ని కూడా ఎమ్మెల్యే మండలంగా ప్రకటించేలా కృషి చేయాలని కోరుతున్నాను. ఈ మధ్యన కేబినెట్ సమావేశంలో 200 గ్రామపంచాయతీలు 11 మండలాలు చేస్తామని ప్రకటన వచ్చిందని, కాబట్టి ఆ 11 మండలాల్లో గార్లపాడు మండలం ఉండాలని గార్లపాడు జేపిసి కమిటీ కోరుకుంటున్నది. ఎందుకు మండలం చేయాలంటే.. గార్లపాడు గ్రామము మండలం కావడానికి అన్ని అర్హతలు వున్నాయంటే జేపీసీ కమిటీ సభ్యులు చెబుతున్నారు. 44 గ్రామపంచాయతీలు గల కోయిలకొండ మండలంలో 18 గ్రామాలు గార్లపహాడ్ మండలం కావడానికి సుముఖత వ్యక్తం చేస్తున్నాయని జేపీసీ సభ్యులు తెలిపారు. గతంలో 16 గ్రామ పంచాయతీల తీర్మానాలు ఇవ్వడం జరిగిందనీ, ఈ 18 గ్రామపంచాయతీలలో 25 వేల జనాభా, ఏడుగురు ఎంపీటీసీలు, 18 మంది సర్పంచులు ఉన్నట్లు తెలిపారు. నారాయణపేట ఎన్నికల సభలో అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి ప్రస్తుత నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి కర్లపహాడ్ మండలం ఏర్పాటు చేయాలంటూ కోరిన ప్రతిపాదన పై స్వయంగా స్వయం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. సీఎం రేవంత్‌రెడ్డి సైతం ఆమె ఇవ్వడంతో తమ మండలం ప్రకటన సులభంగా జరిగిపోతుందనుకుంటున్న తరుణంలో గత డిసెంబర్ నెలలో ప్రభుత్వం ప్రకటించిన నూతన మండలాల ఏర్పాటులో గార్లపహాడ్ ఉండేలా ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి కృషి చేయాలని గ్రామస్తులు జెపిసి సభ్యులు ముక్తకంఠంతో నినదిస్తున్నారు. మండలం ప్రకటించాకే స్థానిక ఎన్నికలు జరపాలి. గార్లపహాడ్ మండల సాధన కమిటీ జేపీసీ కో కన్వీనర్ వెంకటరామరెడ్డి ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి గతంలో ఎన్నికల్లో గెలిచిన తర్వాత కూడా అసెంబ్లీలో గార్లపాడు, కోటకొండ, కాన్కుర్తి మండలాల గూర్చి ప్రస్తావించారు. సంవత్సరం తర్వాత కూడా ఇంకా ప్రస్తావన గూర్చి మాత్రమే మాట్లాడుతున్నారు కానీ వేరే జిల్లాలల్లో మండలం గా ప్రకటిస్తున్నా ప్రస్తుతం స్పందించడం లేదు. గతంలో కూడా మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి మండలాల గురించి శాసనసభలో ప్రస్తావించడమే జరిగింది కానీ మన మండలంగా తీసుకురాలేదు. శాసనసభ సమావేశంలోనే మండలంగా ప్రకటింపజేసి గెజిట్ విడుదల చేస్తూ స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలి.



వెంకటరామరెడ్డి

# సమగ్రంగా పరిశీలించాలి

**లబ్దిదారుల ఎంపిక పకడ్బందీగా చేయాలి**

**కలెక్టర్ విజయేంద్ర బోయి**

**రైతు భరోసా,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,రేషన్ కార్డులు జారీ,ఇందిరమ్మ ఇండ్లు పథకాలపై సమీక్ష**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 18 ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 26న ప్రారంభించనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, రేషన్‌కార్డులు జారీ, ఇందిరమ్మ ఇండ్లు పథకాలకు సంబంధించి లబ్దిదారుల ఎంపికకు సమగ్ర పరిశీలన చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. రైతు భరోసా, రేషన్ కార్డుల లబ్దిదారుల ఎంపిక కొరకు నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి పరిశీలన పై శనివారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, మండల నోడల్ అధికారులు, ఎంపిడిఓలు, తహశీల్దార్‌లతో జిల్లా కలెక్టర్ వెబెక్స్ ద్వారా సమీక్షించారు. రైతు భరోసా కార్యక్రమం కింద వ్యవసాయ యోగ్యమైన భూమి, రేషన్ కార్డుల వెరిఫికేషన్ పై క్షేత్ర స్థాయి పరిశీలన మండలాల వారీగా ఎంపిడి ఓలు, తహశీల్దార్‌లతో సమీక్షించి సూచనలు చేశారు. ఇప్పటివరకు ఎన్ని రెవెన్యూ గ్రామాలు పూర్తి చేశారు. ఇంకా ఎన్ని గ్రామాలు పూర్తి చేయవలసి ఉంది, రేషన్ కార్డుల వెరిఫికేషన్ ఎంత వరకు పూర్తి చేశారు, ఏమైనా సమస్యలు ఉన్నాయా సమీక్షించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా చూడాలన్నారు. లబ్ధిదారుల ఎంపికలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. రైతు భరోసాలో లబ్ధిదారుల వివరాలు వ్యవసాయ శాఖ అధికారులతో రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేసి సాగుకు యోగ్యం కానీ భూములను గుట్టలు, వెంచర్లు, భూసేకరణ కింద తీసుకున్న సాగినట్టు ప్రాజెక్టులు, చెరువులు, కాలువలు ,రహదారులు కోసం తీసుకున్న భూముల వివరాలు జాబితాలో ఉండకూడదని తెలిపారు. సాగుకు యోగ్యంగా ఉండే భూములను జాబితా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని తెలిపారు. రేషన్ కార్డుల కొరకు సమగ్ర కుటుంబ సర్వే లో వచ్చిన దరఖాస్తుదారుల పూర్తి వివరాలు పరిశీలన జరిపి అర్హుల జాబితా రూపొందించాలని ఆదేశించారు. ఈ నెల 16 నుండి నిర్వహిస్తున్న క్షేత్రస్థాయిలో పరిశీలన లో ఇంకా మిగిలిన గ్రామాల ను ఈ నెల 20 వరకు పూర్తి చేసి లబ్ధిదారుల జాబితా తయారు చేసుకోవాలని అన్నారు. లబ్ధిదారుల జాబితా ఈ నెల 21 నుండి 24 వరకు జరిగే గ్రామసభలలో నాలుగు పథకాల లబ్ధిదారుల పేర్లను గ్రామసభలో వివరించాలని అలాగే లబ్ధిదారుల పేర్లను కూడా ప్రదర్శించాలని కలెక్టర్ తెలిపారు. గ్రామ సభలో ఆమోదం పొందిన తర్వాత అర్హుల జాబితా రూపొందించాలని, అభ్యంతరాలు ఉంటే గ్రామ సభలో స్వీకరించాలని అన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాపై ప్రభుత్వం మార్గదర్శకాలు వివరించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

# రైతులు ఎవరు అధైర్యపడవద్దు

**ఆర్డీఎస్ రైతులకు మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ భరోసా**

**ఇటిక్యాల, జనవరి 18 ప్రభాతవార్త :** తుంగభద్ర సుంకేసుల రిజర్వాయర్, తుమ్మిళ్ళ ఎత్తిపోతల ప్రాజెక్ట్ నీటి ఇన్‌ఫ్లోను శనివారం ఏఐసీసీ కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపత్‌కుమార్ మాట్లాడుతూ గత 15 రోజుల నుంచి అలంపూర్ నియోజకవర్గంలోని ఆర్డీఎస్ ఆయకట్టు దారులు ఆర్డీఎస్‌కు నీళ్లు ఎప్పుడు వస్తాయా అని వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నారని పైన ఉన్న ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలో వర్షాభావ, సాంకేతిక, పరిపాలన కారణాల వల్ల నీళ్లు రాకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గ్రహించి స్థానిక సుంకేసుల తుమ్మిళ్లను పరిశీలించడం జరిగిందన్నారు. అలంపూర్‌లో ఉన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, బిఆర్ఎస్ నాయకులు కానీ ఆర్డీఎస్ పై ఎలాంటి అవగాహన లేని నాయకులని తొందరపాటుగా మిడిమిడి జ్ఞానంతో ఏదో ఫోటోలకు ఫోజులు ఇవ్వాలని నీటిని విడుదల చేసినట్టు ఫోజులు కొట్టి రైతులలో అనేక అపోహలు కల్పించడానికి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. వేలాది మంది రైతులు రైతుల పంటలు నష్టపోకూడదని ఫోటోలకు ఫోజులు ఇచ్చే వారి మిడిమిడి జ్ఞానాన్ని బహిర్గతం చేసి రైతులకు న్యాయం చేస్తూ వాస్తవాలను తెలపాలనే ఉద్దేశంతో ఇక్కడికి రావడం జరిగిందన్నారు. వారం రోజుల క్రితం తుంగభద్రకి ఇండెంట్ పెట్టడం జరిగిందని 5.86 టీఎంసీలకు ఇండెంట్ పెట్టడం జరిగిందని నీళ్లు వస్తున్నాయని కానీ తెలంగాణ ప్రభుత్వం పెట్టిన ఇండెంట్‌తో ఆర్డీఎస్ రైతులకు సాగునీరు వచ్చే పరిస్థితి లేదని దశాబ్దాలుగా ఆనవాయితీగా వస్తున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వం రెండు ఇండెంట్లు కలిసి పెడితేనే అప్పుడు రైతులకు న్యాయం జరిగే పరిస్థితి ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో భారత దేశంలో ఎన్నడూ లేని విధంగా తెలంగాణ రాష్ట్రం ఏడాదిలో అత్యధికంగా దిగుబడులు రావడం జరిగిందని కాంగ్రెస్ పార్టీకి రైతుల పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో చూస్తే –మిగతా4లో..



పాజెక్టును పరిశీలించేందుకు కాంగ్రెస్ నాయకులతో కలిసి వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్

## ఈనెల 21న 150 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన

### మక్తల్ ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి

**మక్తల్, జనవరి 18 ప్రభాతవార్త:** మక్తల్ పట్టణంలో నూతనంగా నిర్మించబోయే 150 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి ఈ నెల 21న శంకుస్థాపన చేయబోతున్నట్లు మక్తల్ ఎమ్మెల్యే డా.వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన పట్టణ శివారులో ఆసుపత్రి నిర్మాణ స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ఆధునిక హంగులతో నూతనంగా ఆసుపత్రి నిర్మాణాన్ని చేపడుతున్నామ న్నారు. మక్తల్ పట్టణ పరిసర ప్రాంతాల పేదలకు అనువైన స్థలంలో ఆసుపత్రి నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఆసుపత్రి నిర్మాణంతో పాటు నూతనంగా మంజూరైన డయాలసిస్ సెంటర్‌ను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా ప్రారంభించబోతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఓ సౌభాగ్యలక్ష్మి, తాసిల్దార్ సతీష్ కుమార్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రవికుమార్, నాయకులు కట్ట సురేష్, గడ్డం రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రి నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

## సంక్షేమ పథకాల సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

### అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వీపనగండ్ల జనవరి 18 ప్రభాతవార్త :** సంక్షేమ పథకాల సర్వే పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి వీపనగండ్ల మండలం అధికారులను ఆదేశించారు. శనివారం నాడు వీపన గండ్ల మండలంలో గోవర్ధనగిరి గ్రామంలో ఆయన పర్యటించారు. వీపనగండ్లకు వచ్చిన ఆయన తహసిల్దార్ కార్యాలయం లో మండల అధికారులతో సమావేశమై ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై సూచనలు సలహాలు ఇచ్చారు గ్రామాలలో నిర్వహిస్తున్న సర్వేలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుండి ప్రారంభించనున్న నాలుగు సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేవిధంగా అధికారులు సర్వే చేయా లని సూచించారు. గ్రామాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో సర్వే జరుగుచు న్న తీరును పరిశీలించారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల తుది జాబితా వివరాలు వెల్లడించేందుకు, అభ్యంతరాలు స్వీకరించేందుకు జనవరి 21 నుండి 24 వరకు నిర్వహించే గ్రామ సభలు ఏ రోజు ఏ గ్రామంలో నిర్వహిస్తున్నారో ముందుగానే అన్ని గ్రామాల్లో చాటింపు వేయించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వీపనగండ్ల మండల తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన అధికారులతో మాట్లాడుతూ రైతుభరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సర్వేపై ఆరా తీశారు. వీపనగండ్ల మండల ప్రత్యేక అధికారి లక్ష్మప్ప, తహశీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీఓ శ్రీనివాసరావు మండల వ్యవసాయశాఖ అధికారి డాకేశ్వర్ గౌడు అధికారులు, తదితరులు కలక్టర్ వెంట ఉన్నారు.



గోవర్ధనగిరి గ్రామంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

# ప్రస్తుత జాబితాలు ఫైనల్ కాదు

**గద్వాల, జనవరి 18 (ప్రభాతవార్త):** రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అధికారులు ప్రస్తుతం చూపుతున్న జాబితాలు ఫైనల్ కాదని జెడ్పి మాజీ చైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జీ సరిత స్పష్టం చేశారు. గ్రామ సభల్లో అవసరమైన పేర్లను వాటిలో చేర్చి గ్రామ సభల ఆమోదం పొందిన తర్వాతనే తుది జాబితాలు తయారవుతాయని చెప్పారు. ఈ లోపుగా అధికారులు తయారు చేసిన జాబితాల్లో తమ పేర్లు లేవని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. గ్రామీణ పట్టణ ప్రాంతాలలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన లబ్ధిదారుల జాబితాలలో అనర్హుల పేర్లు, అర్హుల పేర్లు కనిపించడం లేదని పలు ప్రాంతాల నుంచి తన దృష్టికి ఫిర్యాదులు వచ్చాయని సరితమ్మ తెలిపారు. అధికారులు తయారుచేసిన జాబితాలో కొన్నిచోట్ల ఒకే రాజకీయ వర్గానికి చెందిన వారి పేర్లు కూడా ఉన్నాయని తమకు ఫిర్యాదులు అందాయన్నారు. అయితే ప్రస్తుతం అధికారులు తయారుచేసిన ఈ జాబితాలు ఫైనల్ కాదని ఈనెల 21 నుంచి 25 వరకు జరగనున్న గ్రామసభల్లో లబ్ధిదారుల తుది జాబితాలు తయారవుతాయని తెలిపారు. గ్రామ సభలలో అధికారులు తయారుచేసిన జాబితాలను సమీక్షించి వాటిలో నుండి అనర్హుల పేర్లను తొలగించి అర్హులైన వారి పేర్లను జాబితాలో చేర్చడం జరుగుతుందని వివరించారు. ఈ విధంగా గ్రామ సభల్లో సమీక్షించి ఆమోదించిన జాబితాలు మాత్రమే ఫైనల్ అని అందరు గుర్తించాలని సరితమ్మ కోరారు. ఈ లోపుగా అధికారులు తయారు చేసిన జాబితాలలో తమ పేర్లు లేవని ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు ఇతర పథకాలు అందేలా అర్హులైన వారందరి పేర్లు జాబితాలలో ఉండేలా చూసే బాధ్యత తనదేనని చెప్పారు. జిల్లా ఇంఛార్జి మంత్రి, పార్లమెంటరీ సభ్యుడితో కలిసి జాబితాలను చూసిన తర్వాతనే వాటిని ఆమోదించడం జరుగుతుందని సరితమ్మ వెల్లడించారు. అయితే అధికారులు ఎవరైనా తాము తయారు చేసిన జాబితా లు ఫైనల్ అనే తప్పుడు సంకేతాలు ఇస్తే అలాంటి అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అన్ని అర్హతలు కలిగి ఉన్నా ఎంపిక కాని వారు ఎవరైనా ఉంటే అలాంటి వారు గద్వాల లోని సరితమ్మ క్యాంప్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే అలాంటి వాటిని సరిదిద్దేలా చూస్తామని, నిజమైన అర్హులకు న్యాయం చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ సరిత హామీ ఇచ్చారు.


మాజీ జడ్పీచైర్మన్ సరిత తిరుపతయ్య

## మూర్తయ్యగట్టుపై ఘనంగా హజరత్ మౌలాలి ఉర్సు

**భూత్పూర్, జనవరి18, ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం కొత్తమొల్గర గ్రామసమీపంలోని మూర్తయ్యగట్టుపై కొలువుధీరిన హజరత్ మౌలాలి మూషకల్‌కుశ ఉర్సు శనివారం ఘనంగా జరిగింది. వందల సంవత్సరాల చరిత్ర ఉన్న మౌలాలి ఉర్సుకు భూత్పూర్ మండలంతో పాటుఖిల్లా ఘన్‌పూర్ మండలం నుంచి పలు గ్రామాల ప్రజలు తరలి వచ్చి హజరత్ మౌలాలిని దర్శించుకుని తరించారు. కొత్తమొల్గర గ్రామం నుంచి దా దాపు ఐదు కిలోమీటర్ల మేర భక్తులు కాలి నడకన గట్టు పైకి వెళ్లి మౌలాలిని దర్శించుకుని ప్రత్యేక ఫతేహా ప్రార్థనలు నిర్వహించారు. భక్తులు మలీజ సమర్పించి తమ భక్తిప్రపత్తులను చాటుకున్నారు. రోడ్డు సౌకర్యం లేనందున ఎంతో మహి మాన్వితం, చరిత్ర ఉన్న మౌలాలి ఉర్సును అభివృద్ధిలోకి తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సిన అవసరముందని పలువురు భక్తులు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కనీసం గట్టుపైకి వెళ్లేందుకు సరైన మార్గం లేక పిల్లలు, మహిళలు, వయోవృద్ధులు నానా తంటాలు పడుతున్నారు. ప్రభుత్వం గట్టుపైకి రోడ్డు సౌకర్యం కల్పించి మౌలాలిని సనాయాసంగా దర్శించుకునే వీలు కల్పించాలని ఉర్సుకు వచ్చే భక్తులు కోరుతున్నారు.


హజరత్ మౌలాలిని దర్శించుకుంటున్న భక్తులు

## మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శ

**యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆర్.తిరుమలేష్**

**గద్వాల, జనవరి 18 ప్రభాతవార్త :** గద్వాల నియోజకవర్గం మల్దకల్ మండలం నీలపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చంద్రాముడు మృతి చెందిన విషయం తెలుసుకున్న జెడ్పి మాజీ చైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ సరిత తిరుపతయ్య ఆదేశానుసారం యువజన కాంగ్రెస్ జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షుడు ఆర్.తిరుమలేష్, మండల సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మృతదేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వీరి వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పెద్దపల్లి అల్వాల రాజశేఖర్ రెడ్డి, పెదొడ్డి రామకృష్ణ, నీలిపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటన్న, రమేష్, మంగంపేట గోవర్ధన్, బిల్డర్ రామకృష్ణ, పెద్దపల్లి అశోక్, శివ, నరసింహులు, నాగరాజు, వీరన్న తదితరులు ఉన్నారు.


శవయాత్రలో పాల్గొన్న యువజన అధ్యక్షులు

## హుండీ ద్వారా వచ్చిన ఆదాయంలో

## సగభాగాన్ని ఆలయ అభివృద్ధికి కేటాయించాలి

**మల్దకల్ జనవరి 18 ప్రభాతవార్త :** మల్దకల్ మండల కేంద్రంలో స్వయంభుగా వెలిసిన శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా భక్తులు స్వామివారికి హుండీ ద్వారా వివిధ కానుకలు డబ్బులు సమర్పించారని దేవాలయ చైర్మన్ పట్వారి ప్రహ్లద రావు తెలిపారు. స్వామి వారి హుండీ లెక్కింపులో భాగంగా ఆయన మీడియాతో మాట్లాడారు. హుండీ ద్వారా వచ్చిన ఆదాయంలో 50 డబ్బులు ఆలయ అభివృద్ధికి కేటాయించాలని కోరారు. స్వామి వారి హుండీ ఆదాయం సుమారు 26 లక్షలు వచ్చిందన్నారు. వచ్చిన ఆదాయాన్ని మొత్తం ప్రభుత్వమే తీసుకెళ్తుందని, దీంతో ఆలయ అభివృద్ధికి కుంటిపడుతుందని తెలిపారు. కేవలం దాతల సహకారంతోనే ఆలయ అభివృద్ధి జరుగుతుందని, ప్రభుత్వం స్పందించి స్వామివారి హుండీ ద్వారా వచ్చిన ఆదాయంలో సగభాగం ఆలయ అభివృద్ధికి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఇక్కడ స్వయంభుగా వెలసిన శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి వారిని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్కసారి దర్శించుకోవాలని కోరారు.


దేవాలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాదరావు

## సిపిఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

**అమరచింత జనవరి 18 ప్రభాతవార్త :** సిపిఎం తెలంగాణ రాష్ట్ర నాల్గవ మహాసభలు ఈ నెల 25 నుండి 28 వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరగనున్న మహాసభలను విజయవంతం చేయాలని సిపిఎం మండల నాయకులు బి వెంకటేష్ ఆర్ ఎన్ రమేష్ అజయ్ కోరారు. శనివారం అమరచింత మండల కేంద్రంలోని సిపిఎం రాష్ట్ర మహాసభల పోస్టర్ ను విడుదల చేశారు. అలాగే ఈ నెల 25 న సంగారెడ్డి జిల్లా కేంద్రంలో భారీ బహిరంగ సభ ఉంటుందని ఈ బహిరంగ సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సిపిఎం పోలేటి బ్యూరో సభ్యులు బృందాకరత్, బివి రాఘవులు హాజరవుతున్నారని ఈ బహిరంగ సభకు ప్రజలు భారీగా పాల్గొని బహిరంగ సభను విజయవంతం చేయాలని వారు కోరారు. సిపిఎం పార్టీ గత మూడేళ్లకు సిపిఎం పోరాటాల విజయాలపై మహాసభలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని వారు తెలిపారు. సిపిఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం కోసం మేధావులు రైతులు విద్యార్థులు కార్మికులు సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నరసింహ, బుచ్చన్న ,శ్యాంసుందర్ ,కరుణాకర్ ,వెంకటేష్, ప్రభాకర్ ,విజయ్ ,సుజ్ఞానం ,ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.



సిపిఎం రాష్ట్ర మహాసభల పోస్టర్ విడుదల

## బాలకర్మిక వ్యవస్థ నిర్ములనే ప్రధాన లక్ష్యం

**గద్వాల, జనవరి 18 ప్రభాతవార్త :** బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా ఆపరేషన్ స్మైల్ 11 కార్యక్రమంలో భాగంగా సంబంధిత శాఖల సమన్వయంతో రెండు టీంలుగా నిర్వహిస్తూ డ్రాప్ అవుట్ పిల్లలకు వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చినట్లు జిల్లా సంక్షేమ అధికారి సునంద ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15న టీం ఏ గట్టు మండలం లో 10 మంది పిల్లల్ని, టీం బి కేటిదొడ్డి మండలంలో 14 మంది పిల్లల్ని, 16వ తేదీన టీం ఏ ధరూర్ మండలంలో 22 మంది పిల్లల్ని టీం బి మల్దకల్ మండలంలో 20 మంది పిల్లల్ని, 17వ తేదీన టీం ఏ ఐజ మండలంలో 8 మంది పిల్లల్ని, టీం బి వడ్డేపల్లి మండలంలో 9 మంది పిల్లలను మూడు రోజులలో బాలురు 61, బాలికలు 22 ,మొత్తం 83 మంది పిల్లల ఇండ్లను సందర్శించి వారందరికి బడికి వెళ్లి చదువుకోవాలని కౌన్సిలింగ్ ఇచ్చి బడికి వెళ్లే విధంగా చేయడం జరిగిందని ఆమె ఈ సందర్భంగా తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు టీమ్లను ఏర్పాటు చేసి జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించి పిల్లలు పాఠశాలలో చదువుకునే విధంగా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆమె తెలిపారు.

## లబ్ధిదారుల ఎంపికపై ఇంటింటి పర్యవేక్షణ

**నవాబుపేట, జనవరి 18 ప్రభాతవార్త:** మూడవరోజు మండలఅధికారుల సమక్షంలో ప్రభుత్వ పథకాలు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఆహార భద్రత (రేషన్ కార్డులు), ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల కింద అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేందుకు మండలస్థాయిలో నిర్వ హించబడుతున్న ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియను పకడ్బందీగా కొనసాగిస్తున్నారు. మండల పరిధిలోని దొడ్డిపల్లిలో ఎంపిక పర్యవేక్షణలో భాగంగా లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాల రబ్ధిదారుల ఎంపిక పార దర్శకంగా నిర్వహిస్తున్నామని అర్హులకు మాత్రమే పథకాలు అందేలా పర్యవేక్షణ జరుపుతున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో మండల ఎంపీడీవో జయరాం నాయక్, అగ్రికల్చర్ ఏఈ శంకరమ్మ, (శ్వేత) రెవెన్యూ ఇన్స్పెక్టర్ కిరణ్, దొడ్డిపల్లి గ్రామ పంచాయతీ సెక్రెటరీ ఆంజనేయులు గౌడ్, చెన్నారెడ్డి పల్లె గ్రామపంచాయతీ సెక్రటరీ నాగరాజు, ఐకెపి సిసి రామాంజనేయులు, దొడ్డిపల్లి గ్రామస్తులు అనంతయ్య తోపాటు యువకులు చిన్నారెడ్డి పల్లె గ్రామ ప్రజానాయకులు మంత నర్సింలు, జైపాల్ రెడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న అధికారులు

## ఆధార్ సెంటర్ ఉన్న ఎటువంటి ఉపయోగం లేదు

**మద్దూర్, జనవరి 18 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా మద్దూర్ మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ గత నెల రోజుల నుంచి పని చేయకపోవడం వలన విద్యార్థులు ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారని పలువురు అంటున్నారు. విద్యార్థులకు మార్పులు చేర్పులు ఉండడం వలన నారాయణపేటకు లేదా కోస్గి వెళ్లవలసి వస్తుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. నారాయణపేటకు పోయి రావలసి వస్తే రూ.500 ఖర్చవుతున్నాయని ఉదయం నుంచి అక్కడ క్యూలైన్లో ఉండడం వలన ఇబ్బందులకు గురవుతున్నామని పలువురు అంటున్నారు. ఇదే విషయం నారాయణపేట ఈడీఎం విజయ్ కుమార్‌ను వివరణ కోరగా గత నెల రోజుల నుంచి టెక్నికల్ ప్రాబ్లం ఉండటం వలన ఇబ్బంది అవుతుందని ఆయన తెలిపారు. రెండు మూడు రోజుల్లో ఆధార్ సెంటర్ అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన వివరించారు.

## రాష్ట్రస్థాయి చెస్ విజేతకు ఘన సన్మానం

**వనపర్తి క్రైమ్ జనవరి 18 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా కేంద్రంలో తెలంగాణ ఓపెన్ చెస్ చాంపియన్షిప్ వనపర్తి జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అండర్ 11 ఇయర్స్ స్థాయి చెస్ పోటీలలో వనపర్తి పట్టణం 29వ వార్డుకు చెందిన డాక్టర్ రవిచంద్ర శిరీష కుమారుడు రవిష్ చంద్ర జూనియర్ చెస్ 11 సంవత్సరాల లోపులో జరిగిన చెస్ పోటీలలో రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి పొందాడు. ఈ సందర్భంగా స్థానిక బారాస జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ స్థానిక కౌన్సిలర్ భార్గవి, ప్రేమ్ నాథ్ రెడ్డి ,ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ గత సంవత్సరం రాష్ట్రస్థాయిలో ఛాంపియన్ షిప్ పొందిన విజేతను అధిగమించి విజయం సాధించిన రవిచంద్రను అభినందించారు. మున్ముందు జాతీయస్థాయిలో ఈ యొక్క ప్రతిభను కనబరిచి తల్లిదండ్రులకు వనపర్తి ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని రవిష్ చంద్ర కు తల్లిదండ్రులు ప్రోత్సాహం అందించాలని కోరారు. తమకు కావలసినటువంటి సహాయ సహకారాలు మా వైపు నుండి సంపూర్ణంగా అందజేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రవిచంద్ర తాతయ్య ,విశ్వమోహనా చారి ,సత్యనారాయణ చారి , సత్యనారాయణ గౌడ్ ,మాధవ రావు ,పల్లి శ్రీనివాసులు ,ముజ్జు తదితరులు పాల్గొన్నారు.


రవిచంద్రన్‌ను సన్మానిస్తున్న కౌన్సిలర్లు

## నాలుగు పథకాలు సర్వేలో లోపాలు లేకుండా నిర్వహించాలి

**ఉప్పునుంతల, జనవరి 18 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా అమలు చేయనున్న 4 పథకాల లబ్ధిదారుల ఎంపిక పకడ్బందీగా చేయాలని స్థానిక ఎంపిడిఓ మోహన్ లాల్ ఆదేశించారు. శనివారం మండలంలోని సదగోడు, మొల్గర, పెద్దాపుర్, లక్ష్మాపూర్ గ్రామాల్లో రైతు భరోసా సర్వేను ఆయన పరిశీలించారు. అదే విధంగా రేషన్ కార్డుల వెరిఫికేషన్ ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మోహన్ లాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ సర్వే తెలిపారు. సర్వేలో ఎటువంటి లోపాలు లేకుండా సమగ్రంగా నిర్వహించాలని సూచించారు. గ్రామస్తుల నుంచి ఏమైనా ఫిర్యాదు వస్తే దానికి సర్వే చేసినవారే భాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోనే గ్రామాలలో సర్వే పూర్తి చేయాలన్నారు. నేటి వరకు సర్వే పూర్తి చేసి రేపు గ్రామసభలు నిర్వహించాలని ఆదేశించారు. అనర్హులను ఎట్టి పరిస్థితుల్లోనూ అర్హులుగా ఎంపిక చేయవద్దని ఎంపీడీఓ మోహన్‌లాల్ హెచ్చరించారు. అదే విధంగా సర్వే సూపర్ వైజర్లు ,తహసీల్దార్ ప్రమీల, మండల వ్యవసాయ అధికారి రమేష్ మండల ప్రత్యేక అధికారి చందూలాల్, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ ఉమాపతి చారి, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. రైతు భరోసా సర్వేను మండలంలోని మర్రి పల్లి, ఉప్పునుంతల, పెద్దాపూర్, విఘ్నేష్ పూర్, అయ్యవారిపల్లి, పెనిమెళ్ళ, పెద్దాపూర్ గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను వారు పరిశీలించారు.


పెద్దాపూర్‌లో కోళ్ల షెడ్డును పరిశీలిస్తున్న సర్వే అధికారులు

## గురుకుల బాట పట్టేలా చైతన్యం తెచ్చేలా

**బిజినేపల్లి, జనవరి 18 ప్రభాతవార్త:** విద్యార్థులను గురుకులాల్లో చేర్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ గురుకులాల్లో చేరండి విద్యావంతులై విజేతలుగా నిలవండి నినాదంతో ప్రవేశాలపై సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల బిజినపల్లి ప్రిన్సిపాల్ సుమతి ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో అయిదో తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తుంది. విద్యార్థులకు వచ్చిన మార్కులను బట్టి వచ్చే విద్యాసంవత్సరానికి సీట్లు కేటాయిస్తారు. అయిదో తరగతితోపాటు గురుకులాల్లో మిగిలిపోయిన సీట్లకు పరీక్ష నిర్వహిస్తారు. గ్రామీణ విద్యార్థుల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు గురుకులాల ఉపాధ్యాయులు పల్లెబాట పట్టారు. కరపత్రాలతో వెళ్లి తల్లిదండ్రులకు గురుకులాల్లో ప్రవేశంపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన బోధ న అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇంటింటికి గురుకులాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బందిని గ్రామాలు, పట్టణాలకు పంపి ప్రచారం చేస్తోంది. గురుకులాల ఉమ్మడి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని చెబుతున్నారు. అయిదో తరగతిలో చాలా మంది విద్యార్థులు సీట్లు సాధించే అవకాశం ఉండడంతో పేద విద్యార్థులంతా దరఖాస్తు చేసుకునేలా ఉపాధ్యాయులు ప్రయత్నిస్తున్నారు. గతంలోనూ ఈ విధానం సత్ఫలితాలనిచ్చింది. గురుకులాల్లో అందించే నాణ్యమైన విద్యతో పాటు భోజన వసతి, క్రీడలు, ఉన్నత విద్యావకాశాల కోసం తల్లిదండ్రులకు అర్థమయ్యేలా వివరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ లెక్చరర్ డాక్టర్ యాదయ్య, లెక్చరర్ శంకర్ పాఠశాల పిటి రాజేంద్రప్రసాద్, మణిగిల్ల ఆంజనేయులు వెళ్ళినారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న గురుకుల సిబ్బంది

## పెద ప్రజల ఆశజ్యోతి నందమూరి తారక రామారావు

**పెబ్బేరు జనవరి 18 ప్రభాతవార్త :** తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి పద్మశ్రీ నందమూరి తారకరామారావు 29వ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం పెబ్బేరు పట్టణం లోనీ ప్రభుత్వ హాస్పిటల్ లో తెలుగుదేశం పార్టీ నాయకులు రోగులకు పండ్లు, బెడ్ పంపిణి చేసారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి రామన్ గౌడ్ మాట్లాడుతు సమాజమే దేవాలయం - ప్రజలే దేవుళ్ల అని భావించి తెలుగుదేశంపార్టీని స్థాపించి బడుగు, బలహీన వర్గాల వారికి అండగా నిలబడిన ఎన్టీఆర్ అన్నారు. సినీరంగంలో ముందు తరాలకు గుర్తుండేలా శ్రీ కృష్ణుడు రాముడు పలు దేవతల పాత్రలతో ప్రజల మనస్సుల్లో దేవుడు గా స్థానం తెలుగు ప్రజల ఆత్మ గౌరవం కోసం రాజకీయ పార్టీ స్థాపించి దేశ రాజకీయాల్లో సంచలనం ఎన్టీర్ దేశ రాజకీయాల్లో తనదైన ముద్రవేసారు యావత్ దేశంలో ఎక్కడ లేని విధంగా పేద వారికి కేజీ రెండు రూపాయలకే కిలో బియ్యం పదకంతో ఆహార భద్రత ప్రజలకు ఎన్నో ప్రయోజలు చేకూర్చారని రామన్ గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో పెబ్బేరు ప్రభుత్వ డాక్టర్ హరినాధ్ రెడ్డి తెలుగుదేశం పార్టీ నాయకులు వాకిటి బాలరాజ్ రాఘవందర్ గౌడ్, తిరుమలేష్, మురళీగౌడ్, రాజు శెట్టి, పరమేష్, రాముడు, చంద్రశేఖర్, ఎల్లారెడ్డి ఎల్లాస్వామి, నీశే బాలరాజ్, అరవిందు తదితరులు పాల్గొన్నారు.


హాస్పిటల్ బాధితులకు పండ్లు బ్రెడ్ పంపిణి

## బాలల చట్టాల వినియోగంతో ఎంతో ప్రయోజనం

**వనపర్తి క్రైమ్ జనవరి 18 ప్రభాతవార్త :** బాలల చట్టాల వినియోగంతో సమాజంలో ఎంతో ప్రయోజనం చేకూరుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వి. రజని అన్నారు. శుక్రవారం, శనివారం జరిగిన ఓరియంటేషన్ ప్రోగ్రాంలో ఆమె మాట్లాడుతూ పిల్లల స్నేహపూర్వక న్యాయ సేవలు అనే అంశంపై డి ఎల్ ఎస్ ఏ ఆధ్వర్యంలో ప్యానల్ లాయర్లు పారలిగల్ వాలంటరీలకు శిక్షణ రెండు రోజులు జరిగిందనీ ఆమె తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పిల్లలను సన్మార్గంలో నడిపేందుకు న్యాయ సేవల విభాగం ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపట్టినట్టు వివరించారు. పిల్లల కోసం తమ సంస్థ ద్వారా ఉచిత న్యాయ సేవలు అవగాహన సదస్సులు నిర్వహించబడుతున్నాయని తెలిపారు. మైనర్ పిల్లల ప్రయోజనం గురించి సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని తెలిపారు. అనంతరం న్యాయవాదులు కృష్ణవర్ధన్ రెడ్డి, టి శ్రీనివాసు చారి, ఎం. రఘు, డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్, ఎమ్ రాంబాబు ,డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్, లక్ష్మమ్మ మాట్లాడుతూ బాలల హక్కుల గురించి, బాల్య వివాహాల పుట్టే పిల్లలకు వచ్చే అంగవైకల్యాల గురించి, బాల కార్మిక నిషేధ చట్టం, ఫండమెంటల్ రైట్స్, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల, సైబర్ క్రైమ్స్, మూగ చవిటి దివ్యాంగులకు సంబంధించిన భవిత సెంటర్, అంగన్వాడీలో అందించే పోషక ఆహారం గురించి మాట్లాడారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న వి రజిని

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

***కొత్తకోట జనవరి 18 ప్రభాతవార్త :*** కొత్తకోట మండలం కానాయపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ కార్యకర్త జనంపల్లి రాజు మాతృమూర్తి జనంపల్లి కుర్మక్క ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న కొత్తకోట, కానాయపల్లి బిఆర్ఎస్ నాయకులు దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు బాధిత కుటుంబాన్ని పరామర్శించి భౌతికయానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం కుటుంబానికి రావుల రఘువర్ధన్ రెడ్డి 9 వేలు, మాజీ వైస్ ఎంపీపీ లు వడ్డే శ్రీనివాసులు 5 వేలు, గుంత మల్లేష్ 3 వేలు, నక్కల చిన్న నర్సింహ 2 వేలు ఆర్థికసాయం చేసి భరోసానిచ్చారు. వీరితో పాటు మాజీ జడ్పీ వైస్ చైర్మన్ వామన్ గౌడ్, మాజీ సీడీసీ చైర్మన్ చెన్నకేశవ రెడ్డి, యూత్ మండల అధ్యక్షులు నెహ్రు, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యాదగిరి, కానాయపల్లి నరోత్తమ్ రెడ్డి, గ్రామ అధ్యక్షులు హోటల్ రాజు, బక్క గోవర్ధన్, వెంకట్ కుమార్, ఇశ్రాయిల్, సాయిలు, కుర్మయ్య, రవీందర్ గౌడ్, నక్కల చిన్న నర్సింహ్, ధనుష్, ప్రభుదాస్, డీకే లక్ష్మయ్య, నాగన్న లు ఉన్నారు.


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

## రైతు భీమా చెక్కు

## పంపిణి చేసిన ఎమ్మెల్యే మేఘారెడ్డి


బాధితులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

**పెబ్బేరు జనవరి 18 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలం బున్యాధిపూర్ గ్రామానికి చెందిన శ్యామ్ సుందర్ వాళ్ళ అమ్మ సువర్త చనిపోయింది. వారి కుమారునికికు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భీమా కింద వారి కుటుంబానికి 5 లక్షలరూపాయల చెక్కును శనివారంరోజు శాసనసభ్యులు మేఘారెడ్డివారి కుటుంబానికి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ప్రమోదిని, వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్, మాజీ సర్పంచ్ సురేందర్, గౌడ్, యుగంధర్ రెడ్డి, శ్రీహరి, బీరం రాజశేఖర్ రెడ్డి, రాజా గౌడ్, శ్యాంసుందర్ ,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పునుంతలలో రైతు భరోసా

## పథకంపై ముమ్మరంగా సర్వే


సర్వే నిర్వహిస్తున్న అధికారులు

**ఉప్పునుంతల, జనవరి 18 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉప్పునుంతల గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న వ్యవసాయ పొలాల్లోకి వెళ్లి అధికారులు క్షేత్రస్థాయిలో రైతు భరోసా పథకం పై సర్వే చేపట్టారు. శనివారం టీం ఇంఛార్జి ఉప తహసీల్దార్ కేశవ్ ఆధ్వర్యంలో ఉప్పునుంతలకు తూర్పున ఉన్న వ్యవసాయ పొలాల్లోకి వెళ్లి సాగుకు అనువైనభూములు, అనువుగాని భూముల వివరాలను సేకరించారు. అదేవిధంగా ఆహారభద్రత కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల సర్వే తదితర అంశాలపై క్షుణ్ణంగా పరిశీలించారు. సర్వే ఇంఛార్జి, ఉపతహసీల్దార్ కేశవ్, ప్రత్యేకఅధికారి చందులాల్, పంచాయతీకార్యదర్శి వెంకటేష్, మండల విస్తీర్ణఅధికారిని మంజుల, రెవెన్యూ సిబ్బంది ఆదిత్య, జహీర్ రైతులు కొత్త పెద్ద జంగిరెడ్డి, హరిలాల్, మదనాగుల పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా నవోదయ ప్రవేక్ష పరీక్ష

**బిజినేపల్లి, జనవరి 18 ప్రభాతవార్త:** ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన వట్టెం జవహర్ నవోదయ విద్యాలయ 6వ తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించినట్లు నవోదయ ప్రిన్సిపాల్ పి.భాస్కర్ కుమార్ శనివారం తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 27 పరీక్ష కేంద్రాల్లో 6602 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 5331 మంది విద్యార్థులు హాజరు కాగా, 1271 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్ష సజావుగా సాగేందుకు ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులు, కలెక్టర్లు నియమించిన తనిఖీ అధికారులు, పోలీసులు, వైద్యశాఖ సిబ్బంది తోడ్పాటు అందించారని అన్నారు.

## పోగొట్టుకున్న సెల్ ఫోన్లు రికవరీ


బాధితులకు అప్పగించిన మల్దకల్ పోలీసులు

**మల్దకల్ జనవరి 18 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల పోలీస్ స్టేషన్ పరిధిలో గత డిసెంబర్ నెలలో పోగొట్టుకున్న 6సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధిత యజమానులకు అప్పగించినట్లు స్థానిక మండల ఎస్ఐ నందికర్ శుక్రవారం మీడియాకు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలో సెల్ ఫోన్స్ పోగొట్టుకున్న వారి ఫోన్స్ సిఈఐఆర్ అప్లికేషన్ ద్వారా 6 ఫోనులను ట్రేస్ చేసి ఫోన్స్‌ను ఆయా యజమానులను స్టేషన్‌కు పిలిపించి, యాజమానులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎవరైనా తమ సెల్‌ఫోన్ పోగొట్టుకున్నా, చోరీకి గురైనా సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలను పొందుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**చిన్న చింతకుంట, జనవరి 18 ప్రభాతవార్త:** మండల పరిధిలోని అల్లిపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి పురుగుల మందు సేవించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే అల్లిపూర్ గ్రామానికి చెందిన మేస్త్రి రాజు (36 )అప్పుల బాధతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం పురుగుల మందు సేవించగా కుటుంబ సభ్యులు గమనించి ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యానికై హైదరాబాద్‌లోని ఉస్మానియా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స నిర్వహిస్తుండగా శుక్రవారం రాత్రి మృతి చెందాడని ఎస్సై ఆర్. శేఖర్ తెలిపారు. శవానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పజెప్పినట్లు ఆయన తెలిపారు. మృతునికి ముగ్గురు సంతానం, భార్య జానకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## రైతులు ఎవరు అధైర్యపడవద్దు

**మొదటి పేజీ తరువాయిభాగం..**

అర్థమవుతుందన్నారు. నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అపారమైన అనుభవం గల మంత్రి అని మన ఇండెంట్,ఆంధ్ర ఇండెంట్ కలిపి పెట్టడం వల్ల మరొక వెయ్యి క్యూసెక్కుల నీటిని ఒక రోజుకు విడుదల చేసే విధంగా 1.5 టిఎంసిలను విడుదల చేసే విధంగా జీవో తీసుకురావడం జరిగిందని మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ వివరించారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రభుత్వ పరంగా మంత్రిని, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నేడు సరిపడినంత సాగునీటిని రైతులకు అందించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని ఇదే ప్రధాన సాక్ష్యమని గుర్తు చేశారు. ఇండెంట్ పెట్టిన తర్వాత వచ్చే ఇన్‌ఫ్లో నుంచి కొన్ని క్యూసెక్కుల నీరు కేసీ కెనాల్‌కి పోవడం వల్ల రెండు వేల క్యూసెక్కులు కేసీ కెనాల్ ద్వారా బయటకు పోవడం వల్ల మనకు సరైన న్యాయం జరగడం లేదని కెసి కెనాల్ ఔట్‌ఫ్లోని తగ్గించాలని ఆంధ్రా అధికారులను సంపత్ కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌తో పాటు కిసాన్ సెల్ అధ్యక్షులు నాగరాజు, ఆర్డీఎస్ ప్రాజెక్టు మాజీ చైర్మన్ సీతారామ్ రెడ్డి ,మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డప్ప,వైస్ చైర్మన్ కుమార్, గ్రంథాలయ ఛైర్మెన్ నీలి శ్రీనివాసులు ,అధికార ప్రతినిధి షేక్షవాలి ఆచారి, మాస్టర్ మధు, మద్దిలేటి చిన్నిబాబు అన్ని మండలాల మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ పథకాల లబ్దిదారుల ఎంపికలో**

## పారదర్శకత పాటించాలి: జిల్లా కలెక్టర్ సంతోష్

**మొదటి పేజీ తరువాయి భాగం..**

చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. డిజిటల్ సంతకం ఉన్న పట్టా పాస్ బుక్కులకు సంబంధించి కూడా సదరు భూములలో పంటలు సాగు చేస్తున్నారా లేదా అన్నది క్రాప్ బుకింగ్ వివరాల ఆధారంగా పరిశీలన చేయాలన్నారు. వ్యాపార, వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న భూములను క్షేత్రస్థాయిలో గుర్తించి పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలని, వాటిని సంబంధిత పోర్టల్ లో అప్లోడ్ చేయాల్సి ఉంటుందని సూచించారు. సేకరించిన వివరాలను వెంట వెంట తప్పులు లేకుండా క్రమపద్ధతిలో రిజిస్టర్లలో నమోదు చేసుకోవాలని, తద్వారా డేటా ఎంట్రీ సమయంలో పొరపాట్లకు అవకాశం ఉండదని అన్నారు. రైతు భరోసా పథకానికి సంబంధించిన వ్యవసాయ యోగ్యమైన భూములకు మాత్రమే రైతు భరోసా వర్తిస్తుందని కలెక్టర్ తెలిపారు. అనంతరం ఐజా మండలంలోని సర్వే నంబర్లు 913, 930, 518, వడ్డేపల్లి శివారులోని సాగు చేయని భూములను స్వయంగా పరిశీలించారు. కిష్టాపురం గ్రామంలోని పంచాయితి కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసి, కొత్త రేషన్ కార్డుల కోసం అర్హులైన కుటుంబాలను గుర్తించే సమయంలో, పాత కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లు లేకుండా క్షుణ్ణంగా పరిశీలన జరపాలని అన్నారు. రేషన్ కార్డులలో పేర్ల తొలగింపుతో పాటు కొత్త పేర్లను చేర్చడం వంటివి కూడా చేయాల్సి ఉన్నందున దరఖాస్తుదారుని కుటుంబంలోని సభ్యులందరి వివరాలను సేకరించాలని కలెక్టర్ తెలిపారు. ఎలాంటి గందరగోళం, తప్పిదాలకు ఆస్కారం లేకుండా క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అర్హుల జాబితాల రూపకల్పనలో ఏవైనా సందేహాలు ఉంటే అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు జ్యోతి, ప్రభాకర్, ఎంపీడీఓ వెంకటయ్య,జిల్లా పంచాయతీ అధికారి శ్యాంసుందర్, పౌరసరఫరాల శాఖ అధికారి స్వామి కుమార్, ఆర్.ఐ.లు, ఏఈఓలు, పంచాయతీ సెక్రెటరీ లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మూడు కార్లు డీ: ఒకరు మృతి

**క్షతగాత్రుల్లో కర్ణాటక వాసులు**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 18 ప్రభాతవార్త:** హైదరాబాద్–శ్రీశైలం ప్రధాన రహదారిపై చోటు చేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరి కొందరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన కొంత మంది యాత్రికులు శ్రీశైలం మల్లన్న దర్శనానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో స్వగ్రామం వెళ్తున్నారు. వీరంతా రెండు కార్లల్లో బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న కార్లను నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం హాజీపూర్ సమీపంలోని శ్రీశైలం ప్రధాన రహదారిపై హైదరాబాద్ నుంచి ఎదురుగా వస్తున్న ఇన్నోవా కారు బలంగా ఢీ కొట్టింది. దీంతో కర్ణాటక రాష్ట్రానికి చెందిన భక్తుల కార్లు ముందు భాగం పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇన్నోవా కారులో బిలాల్ (28) తన అన్నతో కలిసి రంగాపూర్ నిరంజన్ షావలి దర్గా ఉర్సు వేడుకలను తిలకించేందుకు వెళ్తున్నారు. ప్రమాదంలో బిలాల్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కర్ణాటకలోని గుల్బర్గాకు చెందిన విష్ణుకాంత్, విజయలక్ష్మి, వాసవి, మంజు, జగదీష్‌తో పాటు మరికొంత మంది ప్రమాదంలో గాయపడ్డారు. వారిని చికిత్స కోసం అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

## త్వరలో పియూకి న్యాక్ బృందం

**యూనివర్సిటీ క్యాంపస్, పీజీ సెంటర్లలో న్యాక్ మాక్ టీం సందర్శన**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 18 ప్రభాతవార్త:** జనవరి 23 ,24 ,25 తేదీలలో పాలమూరు యూనివర్సిటీకి న్యాక్ బృందం రానున్న నేపథ్యంలో పాలమూరు యూనివర్సిటీలో ఏ ర్పాట్లు శరవేగంగా కొనసాగుతున్నాయి. శనివారం పాలమూరు యూనివర్సిటీలో నలు గురు సభ్యులతో కూడిన న్యాక్ మాక్ టీం నాలుగు బృందాలుగా ఏర్పడి తనిఖీ చేశారు. ప్రొ॥శ్రీరామ్ వెంకటేష్,ప్రిన్సిపల్ డా. చంద్ర కిరణ్ యూనివర్సిటీ పీజీ కాలేజీ లోని అన్ని విభాగాలలో ఫాకల్టీ ప్రొఫైల్స్ , పరిశోధన పత్రాలు, ల్యాబ్ సౌకర్యాలను క్షుణ్ణంగా పరి శీలించారు. పరీక్షల నిర్వహణ, రిజల్ట్స్ విశ్లేషణ మొదలగు అంశాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ సమగ్రంగా ఉండాలని సూచనలు చేశారు. ప్రొ॥ వీరేశం సంయుక్త సంచాలకులు డా.అంకం భాస్కర్ ఫార్మసీ కాలేజీలో అన్ని డిపార్ట్మెంట్స్‌లో డాక్యుమెంటును ,హాస్టల్లో మెనూ తదితర అంశాలను పరిశీలించి, మెరుగైన న్యాక్ కోసము మెలకువలు చెప్పారు. ప్రొ॥ నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ డా. కృష్ణయ్య గద్వాల్ పీజీ సెంటర్ లో న్యాక్‌కు అవసరమైన ఫైల్స్ ను క్రమపద్ధతిలో పెట్టి, న్యాక్ బృందం అడిగిన డేటాను మాత్రమే చూపించాలని అన్నారు. ప్రొ॥ శ్రీనివాసులు, ప్రొ॥ జైపాల్ రెడ్డి ఒక బృందంగా ఏర్పడి కొల్లాపూర్ పీజీ సెంటర్, వనపర్తి పిజి సెంటర్‌లో మౌలిక వసతులు పరిశోధనలకు సంబంధించిన డాక్యుమెంట్స్‌పై ప్రధానంగా ద్రుష్టి సారించాలని చెప్పారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య జి. ఎన్. శ్రీనివాస్ మాట్లాడుతూ న్యాక్ మాక్ టీం కు ధన్యవాదములు అని, న్యాక్ మాక్ టీం చేసిన పలు సూచనల ఆధారంగా అన్ని విభాగాల అధిపతులు, క్రైటీరియా కోఆర్డినేటర్లు, ప్రిన్సిపాల్స్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు సిద్ధంగా చేయాలని, మెరుగైన న్యాక్ గ్రేడింగ్ కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు దగ్గరుండి పర్యవేక్షించాలని సూచించారు. రిజిస్ట్రార్ ప్రొ॥ చెన్నప్ప, ఐక్యుఏసి డైరెక్టర్ డా. మధుసూదన్ రెడ్డి తదితరులు న్యాక్ మాక్ టీంకు ధన్యవాదములు తెలిపారు.

## చట్టాలపై విద్యార్థులకు అవగాహన

**నారాయణపేట టౌన్, జనవరి 18 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా న్యాయ సేవా సంస్థ లీగల్ సర్వీసెన్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం నారాయణపేట పట్టణంలోని శ్రీ వేద సరస్వతి జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా నాయక్ సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ న్యాయ సేవలు, వరకట్న వేదింపులు, సఖి సెంటర్, వోల్డేగే హోమ్, గవర్నమెంట్ నుంచి వచ్చే బెనిఫిట్స్ ప్రయోజనాలపై అవగాహన, న్యాయపరమైన రక్షణ, చట్టపరమైన అవగాహన, ఉచిత న్యాయ సహాయం ఎలా పొందాలి, అమలు వంటివి న్యాయ సేవా సంస్థ చట్టాలపై అవగాహన కల్పించారు. 15100 టోల్ ఫ్రీ నెంబర్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తదుపరి న్యాయమూర్తి చిల్డ్రన్స్ హోమ్, ఓల్డేజ్ హోమ్‌లను అకస్మాత్తుగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆహార దిన పట్టిక ఆహార ధాన్యాల నాణ్యత, త్రాగునీరు, పరిశుభ్రత, తదితర అంశాల గురించి తెలుసుకున్నారు స్టాక్ రిజిస్టార్ పరిశీలించారు. విద్యార్థులకు చదువుతోపాటు అన్ని విధాల ఆట పోటీలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ నాగేశ్వరి, సీనియర్ అడ్వకేట్ నందు నామాజీ, జూనియర్ క్రాంతి కళాశాల ప్రిన్సిపాల్ శేషమ్మ, పార లీగల్ వాలంటీర్ హాజమ్మ, నర్సిములు, బాలరాజ్, ఆశప్ప గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బుడ్డారెడ్డిపల్లిలో సిసి రోడ్డుకు భూమి పూజ

**ఇటిక్యాల,జనవరి 18 ప్రభాతవార్త :** మండల పరిధిలోని బుడ్డారెడ్డిపల్లి గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 5 లక్షల రూపాయల సిసి రోడ్డుకు మంజూరు కాగా శనివారం ఏఐసీసీ కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ఆదేశాలు మేరకు జిల్లా గ్రంధాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులు అల్లంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అధ్యక్షులు రుక్మానందరెడ్డి స్థానిక గ్రామ నాయకులతో కలిసి సిసి రోడ్డుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారిని స్థానిక గ్రామ నాయకులు సన్మానించారు.ఈకార్యక్రమంలో మండల మైనార్టీ అధ్యక్షులు ఎండి అల్లాభకాష్. చాగాపురం గ్రామ అధ్యక్షుడు చంద్ బాషా, ఉపాధ్యక్షుడు స్వాములు, వెంకటస్వామి, ప్రభుదాస్, రాజారెడ్డి, బుడ్డారెడ్డిపల్లి గ్రామ కిసాన్ సెల్ అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి, అధ్యక్షుడు రామకృష్ణ, తిరుమల్, కురువ శేఖర్, కుమ్మరి ఎర్రన్న,రాజు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

**ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి**

## దాతలు ముందుకు రావాలి

**ప్రభుత్వ పాఠశాలకు వాటర్ ప్లాంట్ వితరణ :ఎంపిడిఓ చంద్రశేఖర్**

**లింగాల, జనవరి 18 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు ముందుకు రావాలని ఎంపిడిఓ చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఆవుసలికుంట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు దాత రంగినేని చక్రధర్ రావు పాఠశాలకు వాటర్ ప్లాంట్ వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపిడిఓ చంద్రశేఖర్ హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా దాతలు అందిస్తున్న విద్య సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఎదగాలని కోరారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం ఎన్నో రకాల సదుపాయాలను కల్పిస్తుందని ప్రభుత్వం, దాతలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం దాత చక్రధర్ రావు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన త్రాగు నీటిని అందించాలనే ఉద్దేశంతో ఈ మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఇస్తున్నానని విద్యార్థులు బాగా చదివి ఎదగాలని కోరారు. అనంతరం విద్యార్థులకు వాటర్ బాటిల్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.పాండురంగం, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ నాగమణి, మాజీ సర్పంచ్ బండి ఎల్లయ్య, పంచాయతీ కార్యదర్శి ఎన్ చంద్రయ్య, ఉపాధ్యాయులు హరికృష్ణ, రేష్మ, గ్రామ యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన గొప్ప మహాయక్తి ఎన్టీఆరే



కొత్తకోటలో ఎన్టీఆర్ వర్ధంతి జరుపుకుంటున్న అభిమానులు



అమరచింతలో నివాళులర్పిస్తున్న టిడిపి నేతలు



నివాళులర్పిస్తున్న టిడిపి నేతలు

**కొత్తకోట జనవరి 18 ప్రభాతవార్త :** ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన గొప్ప మహాయక్తి ఎన్టీఆరే నని,ఎందరు దేవుళ్ళు ఉన్నా వెండితెర దైవం ఒక్క ఎన్టీఆరే, కలియుగ వేంకటేశ్వరుడు,రాముడూ,కృష్ణుడూ,ఎన్టీఆరే,చందమామ అందరికీ చందమామే అందరికీ రక్త సంబంధం లేకపోయినా బ్రదర్ అని అందర్నీ పలుకరించే గొప్ప మహాయక్తి ఎన్టీఆరే నని మాజీ ఎంపీ టిసి టిడిపి కొత్తకోట మండల అధ్యక్షులు యం. కిషన్ నాయక్ అన్నారు.శనివారం విశ్వవిఖ్యాత నటుడు డాక్టర్ పద్మశ్రీ దివంగత నేత టిడిపి మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 29 వ వర్ధంతి సందర్భంగా మాజీ ఎంపీ టిసి టిడిపి కొత్తకోట మండల అధ్యక్షులు యం. కిషన్ నాయక్ ఆధ్వర్యంలో కొత్తకోట మున్సిపల్ కేంద్రంలోని పట్టణ చౌరస్తాలో బాబు జగ్జీవన్ రావ్ విగ్రహం దగ్గర ఎన్.టి.రామారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.ఈకార్యక్రమంలో దేవరకద్ర ఇన్చార్జి జనార్ధన్, కొత్తకోట మాజీ సర్పంచ్ జనార్ధన్ సాగర్, జనార్ధన్ గౌడ్, యస్. ఈశ్వరయ్య, శ్రీరాములు నాయి, జగ్గన్న, కుల్లాయప్ప, చంద్రమోహన్, భాస్కర్, కానాయిపల్లి శ్రీనివాసులు, తోట సత్యనారాయణ, ఆంజనేయులు, అంజి, కొండన్న, భాస్కర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

**అమరచింత జనవరి 18 ప్రభాతవార్త :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి వేడుకలు శనివారం అమరచింత మున్సిపల్ కేంద్రంలోని టిడిపి పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమరచింత బస్టాండ్‌లో తారక రామారావు విగ్రహానికి టిడిపి మండల అధ్యక్షులు మోదీ మనోహరాజ్ టిడిపి నాయకులు పోసిరి గోపి పూలమాలలు వేసి ఘననివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నందమూరి తారక రామారావు హాయంలో సంక్షేమ పథకాలు అందించిన గొప్ప మహోన్నత వ్యక్తి అని వారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో తొమ్మిది నెలలోనే తెలుగుదేశం పార్టీ ఏర్పాటు చేసి అధికారం చేపట్టిన మొట్టమొదటి వ్యక్తి నందమూరి తారక రామారావు అని వారన్నారు. కీర్తిశేషులు నందమూరి తారక రామారావు ఆశయ సాధన కోసం టిడిపి శ్రేణులు కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఆత్మకూరు జనవరి 18 ప్రభాతవార్త :** ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు కీర్తిశేషులు నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి వేడుకలను మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో శనివారం రోజు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి దివాన్ జి అశోక్ కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రపంచ పటంలో నిలిపిన ఘనత ఎన్టీఆర్‌కి దక్కుతుందని ఆయన కొనియాడారు. పేదలకు సంక్షేమ పథకాలు పంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాజకీయాన్ని పరిచయం చేసిన వ్యక్తిగా ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం హైదరాబాదులో కూడా అభివృద్ధికి పునాదిరాయివేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత నందమూరి రామారావు కె దక్కుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కట్టెలమండి రాములు, వడ్డే మేస్త్రి వెంకటన్న ,తిరుపతయ్య గౌడ్ ,లచ్చన్న గౌడ్, రాములు, కొండన్న తదితరులతో పాటుగా పలువురు అభిమానులు తెలుగు దేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**మల్దకల్ జనవరి 18 ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు 29 వ వర్ధంతి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. మండల పార్టీ అధ్యక్షుడు బంగి గోవిందు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు ఎన్టీరామారావు పేదల కోసం బడుగు బలహీన వర్గాల కోసం అణగారిన వర్గాల కోసం తెలుగువాడి ఆత్మగౌరవం కోసం తెలుగుదేశం పార్టీని 1982 సంవత్సరంలో స్థాపించడం జరిగింది. కేవలం 9నెలల కాలంలో పార్టీని అధికారంలోకి రావడం జరిగింది. పటేల్ పట్వారీ వ్యవస్థను రద్దు చేసినారు వృద్ధులకు వృద్ధ్యాపపింఛన్లు మంజూరు చేసింది. పక్కా గృహాలు నిర్మించడము జరిగింది. జనాథావస్త్రాలు పంపిణీ చేశారు. రెండు రూపాయలకే కిలో బియ్యం పథకం అమలు చేశారు. చలన చిత్ర పరిశ్రమలో పౌరాణిక చిత్రాల పాత్రలతో యావత్ ప్రపంచానికే దేవుడయ్యాడు అటువంటి యుగపురుషుడు ఎన్టీఆర్ కావున ఆ మహానుభావుడు పెట్టిన పార్టీలో వుంటూ ఆయన ఆశయాలను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిమ్మప్ప,నడిపి సవారన్నా ,ఎల్లప్ప ,గజేంద్ర ,తిరుమల్ , రాముడు ,నరసింహా ,మల్లికార్జున్, రంగన్న పాల్గొన్నారు.

**నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపిన ఎన్టీఆర్**

**బిజినేపల్లి, జనవరి 18 ప్రభాతవార్త:** బడుగు బలహీన వర్గాల వారికి రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించిన సమతావాది ఎన్టీఆర్ అని తెలుగు యువత మండల అధ్యక్షుడు కటికే సుల్తాన్ అన్నారు. అంబేద్కర్ చౌరస్తాలో ఎన్టీఆర్ 29వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కటికే సుల్తాన్ మాట్లాడుతూనిరుపేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు నింపిన మహనీయుడు ఎన్టీఆర్ అని తెలిపారు. సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు అన్న సూక్తిని మొదటిసారిగా రాజకీయాలకు పరిచయం చేసిన మానవతావాది ఎన్టీఆర్ అన్నారు. ఎన్టీఆర్ ఆశయ సాధనలో అనుక్షణం పనిచేస్తామని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అతిపెద్ద విజయం సాధించబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో అధికారం అంటే పేదల జీవితాలు మార్చేందుకు వచ్చిన అవకాశం అని నిరూపించిన మాననీయులు ఎన్టీఆర్ ఆశించిన సమసమాజాన్ని సాధించుకుందామని పిలుపునిచ్చారు. వర్ధంతి వేడుకల్లో టిడిపి నాయకులు రామ్‌కిషన్, సింగోటం, నరేందర్, రమేష్, మధు, రాము, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

**చిన్న చింతకుంట, జనవరి 18 ప్రభాతవార్త:** బడుగు బలహీన వర్గాల సంక్షేమానికై అహర్నిశలు కృషి చేసిన మహనీయుడు నందమూరి తారకరామారావు అని టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ దేవరకద్ర జనార్ధన్ తెలిపారు.శనివారం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పరిపాలన వ్యవస్థ, రెండు రూపాయలకు కిలో బియ్యం తదితర సంక్షేమ పథకాలను తీసుకొచ్చి పేదల గుండెల్లో ఎన్టీఆర్ చిరస్థాయిగా నిలిచారని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నవీన్ కుమార్, పురుషోత్తం ,గంజి కాంతయ్య, రామలింగం,శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాల అమలుకై క్షేత్రస్థాయిలో తనిఖీ

**ఊర్కొండ/వెల్దండ, జనవరి 18 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఆహా ర భద్రత (రేషన్) కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సంక్షేమ కార్యక్ర మాలకు సంబంధించి క్షేత్రస్థాయి పరిశీలన సందర్భంగా అర్హులైన వారి వివరాలను సేకరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు, సర్వే బృం దాలకు సూచించారు. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ కల్వకుర్తి రెవిన్యూ పరిధిలోని ఊర్కొండ, వెల్దండ మండలంలోని ఊర్కొండ, కోట్ర గ్రామాల్లో శనివారం ప్రభుత్వ పథకాల అమలుకు క్షేత్రస్థాయి పరిశీలనలో సేకరించిన వివరాలను తప్పులు లేకుండా క్రమపద్ధతిలో రిజిస్టర్లలో నమోదు చేయాలని, తద్వారా డేటా ఎంట్రీ సమయంలో పొరపాట్లకు అవకాశం ఉండదని సూచించారు. గ్రామాలలో రైతు భరోసా, రేషన్ కార్డుల జారీ తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేందుకు వీలుగా నిర్వహిస్తున్న ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియను నిశితంగా పరిశీలన చేశారు. అర్హులైన లబ్ధిదారులను ఏ ప్రాతిపదికన గుర్తిస్తున్నారు, ఏయే అంశాలను పరిగణలోకి తీసుకుంటున్నారు, సేకరించిన అంశాలను రిజిస్టర్లలో క్రమపద్ధతిలో నమోదు చేస్తున్నారా? లేదా అని తనిఖీ చేసిన కలెక్టర్, అధికారులకు కీలక సూచనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రతీ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఫీల్డ్ వెరిఫికేషన్ వేగంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరిస్తూ సమగ్ర వివరాలను సేకరించాలని, ఆధార్ కార్డు, ప్రజాపాలన దరఖాస్తులు, సామాజిక ఆర్థిక సర్వే వివరాలతో క్షేత్రస్థాయి పరిశీలన వివరాలను సరిచూసుకోవాలన్నారు.రైతు భరోసా పథకానికి సంబంధించి నాలా కన్వర్షన్, గోదాములు, రైస్ మిల్లులు, డిటిసిపి లేఅవుట్, భూసేకరణ, వ్యవసాయానికి యోగ్యంగా లేని భూములను సర్వే నెంబర్ల వారీగా పరిశీలించాలని, భూ భారతి (ధరణి) పోర్టల్, గూగుల్ మ్యాప్ ల ఆధారంగా వాస్తవ వివరాలను నిర్ధారణ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. డిజిటల్ సంతకం ఉన్న పట్టా పాస్ బుక్కులకు సంబంధించి కూడా సదరు భూములలో పంటలు సాగు చేస్తున్నారా లేదా అన్నది క్రాప్ బుకింగ్ వివరాల ఆధారంగా పరిశీలన చేయాలన్నారు. అర్హుల జాబితాల రూపకల్పనలో ఏవైనా సందేహాలు ఉంటే అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని ఫీల్డ్ వెరిఫికేషన్ నిర్వహిస్తున్న బృందాలకు సూచించారు. క్షేత్ర స్థాయి పరిశీలన బృందాల పనితీరును మండల స్థాయిలో తహసీల్దార్లు, డివిజన్ స్థాయిలో ఆర్డీఓలు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట కల్వకుర్తి ఆర్డీవో శ్రీను, వెల్దండ తాహసిల్దార్ కార్తీక్ కుమార్, ఎంపీడీవోలు, ఎంపీవోలు మండల వ్యవసాయ అధికారులు, తదితరులు ఉన్నారు.

## సమస్యల పరిష్కారానికై కలిసి నడుద్దాం : రామచంద్రారెడ్డి

**అయిజ జనవరి 18 ప్రభాతవార్త :** మున్సిపాలిటీలో సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కలిసి నడుద్దామని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం బిజెపి పట్టణ అధ్యక్షులు కంపాటి భరత్ రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపాలిటీ ఆవరణలో చేపట్టిన నిరసన దీక్షకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకులు మారిన పాలన విధానం మారలేదని, అందరూ కలిసి ఒక్కటై పలు సమస్యల పరిష్కారానికై పోరాటం చేద్దామన్నారు. ఇందులో భాగంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయటం, ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేయటం, కోర్టును, ఫైర్ స్టేషన్ ను మంజూరు చేయటం 50 పడగల ప్రభుత్వ వైద్యశాలలు నిర్మించడం, పాత పోలీస్ స్టేషన్లో గ్రంథాలయంగా మార్చటం, నూతన గ్రంథాలయాన్ని నిర్మించడం, మున్సిపాలిటీలో 20 వార్డులను 30 వార్డుగా పెంచడం, ప్రధాన కూడలిలో ఐమాక్స్ బలుపులను ఏర్పాటు చేయటం, కంట్రోల్ రూమ్ లో తెరిచి, పట్టణం ఇరువైపులా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాటిని కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే మున్సిపాలిటీలో సిటిజన్షిప్ పట్టికను ఏర్పాటు చేసి కొనో కార్పస్ మొక్కలను తొలగించి, వాటి స్థానంలో వేపా, జామ, గానుగ, మామిడి లాంటి మొక్కలను పెంచి ప్రకృతిని కాపాడాలన్నారు. అదేవిధంగా ప్రధాన కూడలిలో చెత్తబుట్టలను ఏర్పాటు చేయటం, ఉత్తనూర్ చౌరస్తా నుంచి ఉప్పల చౌరస్తా వరకు డివైడర్‌ను ఏర్పాటు చేసి, వాటిపై ఐమాక్స్ బల్బుల ఏర్పాటు చేయాలన్నారు. అలాగే మున్సిపాలిటీలోని అనేక సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారానికి మున్సిపాలిటీలో ఉన్న ప్రజలంతా ఏకమై పోరాడుదాం అని పిలుపునిచ్చారు. సమస్యల పరిష్కారానికి మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశంలోప్రత్యేక తీర్మానం చేసి, రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కౌన్సిలర్లను కోరారు. కార్యక్రమానికి కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడికొండ బీమ్ సేమ్ రావు, మండలాధ్యక్షులు గోపాలకృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు ప్రదీప్ స్వామి, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ యాదవ్, పట్టణ ఉపాధ్యక్షులు లక్ష్మణ్ గౌడ్, బూత్ అధ్యక్షులు తెలుగు నర్సింహులు, ఎం.శేఖర్, కే.రాజశేఖర్, తిమ్మప్ప, తెలుగు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాలకు అతీతంగా పట్టణాభివృద్ధి : ఎమ్మెల్యే యెన్నం

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 18 ప్రభాతవార్త:** రాజకీయాలకు అతీతంగా మహబూబ్ నగర్ పట్టణాభివృద్ధి చేస్తామని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మహబూబ్ నగర్ మున్సిపాలిటీ లోని వార్డు నెంబర్ 7 పద్మావతి కాలనీ లో సిసి రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం రూ.115.60 లక్షలతో నిర్మించనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం మేము కృషి చేస్తామని ఆయన పునరుద్ఘాటించారు. పట్టణంలోని చాలా కాలనీల్లో సంవత్సరాల కొలది ఉన్నటువంటి సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కట్టా రవికిషన్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ పాల్గొన్నారు. మహబూబ్ నగర్ పట్టణం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం చర్చి కాంపౌండ్ వాల్ నిర్మాణానికి సహకరిస్తా పిల్లల మర్రి రోడ్‌లోని పెంతె కోస్ట్ మిషన్ చర్చి కాంపౌండ్ వాల్ నిర్మాణానికి సహకరిస్తానని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చర్చి ప్రతినిధులకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్ ఆధ్వర్యంలో పెంతె కోస్ట్ మిషన్ చర్చి సంఘ సభ్యులు ఎమ్మెల్యే గారిని కలిసి వినతిపత్రం అందజేశారు. చర్చి కాంపౌండ్ వాల్ గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు కూలిపోయిందని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే ఆయన సానుకూలంగా స్పందించి, వాల్ నిర్మాణానికి ఎస్టిమేషన్స్ తయారు చేయించి తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ మైనారిటీ నాయకులు ఎంఎస్ రవికుమార్, సంఘ సభ్యులు సామెల్, శేఖర్, అనంతమ్మ, రూప, ఎస్తేర్, బెనోని, క్రిస్టియన్ మైనారిటీ పట్టణ అధ్యక్షులు శామ్యూల్ దాసరి ఉన్నారు.

## భగవంతుని సేవలో తరించాలి : ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**దేవరకద్ర, జనవరి 18 ప్రభాతవార్త :** భగవంతుని సేవలో తరించాలి అని నూతనంగా ఎంపికైన మన్యంకొండ దేవస్థానం పాలకమండలి సభ్యులతో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని మన్యం కొండ శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి పాలకమండలి నూతన సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవంతుని సేవ లభించడం ఇది పూర్వ జన్మ సుకృతం అని, భగవంతునికి చేరువగా చేరి సేవ చేసుకొనే అవకాశం చాలా అరుదుగా మాత్రమే లభిస్తుందన్నారు. మన్యంకొండ దేవస్థానాన్ని బ్రహ్మాండంగా అభివృద్ధి చేసుకుందామని, ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని రకాల వసతులు కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ దేవాలయ విశిష్టత తెలుసునని, అందుకే దేవాలయ అభివృద్ధికై ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని గుర్తు చేశారు. భక్తులకు అధునాతన సౌకర్యాలు ఏవి కావాలో వాటిని గుర్తించి అందించే దిశగా ముందుకు సాగుతున్నామని ఆయన స్పష్టం చేశారు. మన్యంకొండ జాతరకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తారని, కాబట్టి భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మన్యం కొండ దేవస్థానం వారి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అంతకుముందు పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. వేదపండితులు ఎమ్మెల్యేకు వేద ఆశీర్వాదం అందించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ అలహరి మధుసూదన్ చారి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ , మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ద విజయ్‌కుమార్, యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**పంటల సాగుకు అనుకూలం లేని**

## భూముల వివరాలు సేకరించాలి

**తెలకపల్లి, జనవరి 18 ప్రభాతవార్త:** వ్యవసాయ పంటల సాగుకు అనుకూలంగా లేని భూములను సేకరించి నమోదు చేయాలని నాగర్ కర్నూల్ ఆర్డిఓ కె సురేష్ వ్యవసాయ అధికారులు సిబ్బందికి సూచించారు. శనివారం మండల పరిధిలోని అనంతసాగర్,ఆలేరు,గట్టునెల్లికుదురు,జన్మిస్తాపూర్ గ్రామాలలో వ్యవసాయ అధికారులు సిబ్బంది ఫీల్డ్ పరిశీలన నిర్వహించా రు. ఈకార్యక్రమంలో పాల్గొన్నవారు మాట్లాడుతూ సాగుకు యోగ్యం కానటువంటి భూముల వివరాలు సేకరించడం ముఖ్యంగా పంట పొలాల్లో ఇళ్ల నిర్మాణం, గోదాముల నిర్మాణం ,కోళ్ల ఫారాలు, చేపల చెరువులు అదేవిధంగా కాలువలకు రోడ్లకు పోయినటువంటి భూముల వివరాలు సేకరించి నమోదు చేయాలని సూచించారు.కార్యక్రమంలో మండలవ్యవసాయ అధికారి నర్మద,ఏఈఓలు,పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నాటుసారా స్థావారాలపై దాడులు

**లింగాల,జనవరి18 ప్రభాతవార్త:** నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించి, ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెల్కపల్లి ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ రమణయ్య తెలిపారు. శనివారం మండల పరిధిలోని పద్మనపల్లి, చెన్నంపల్లి, ధారారం గ్రామాల్లో ఎక్సైజ్ శాఖఅధికారులు దాడులు నిర్వహించారు. ప్రోహిబిషన్, ఎక్సైజ్ డైరెక్టర్ కమలాసన్ రెడ్డి ఆదేశాల మేరకు నాటుసారా స్థావరాలపై స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా జిల్లా ఎక్సైజ్ అధికారిణి గాయత్రి పర్యవేక్షణలో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో దాదాపుగా 500 లీటర్ల బెల్లం పానకం పారబోసి,12 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని బుజ్జి, పద్మనపల్లి గ్రామానికి చెందిన అనూష,ధారారం గ్రామానికి చెందిన నీలా, అనే ముగ్గురు వ్యక్తులపై కేసునమోదు చేసినట్లు తెలిపారు.ఈ దాడులలో తెల్కపల్లి ఎక్సైజ్‌శాఖ సిబ్బంది, డీటీఎఫ్ పాల్గొన్నారు.

**రోడ్డు ప్రమాదంలో**

## వ్యక్తి మృతి ఇద్దరికి గాయాలు

**అయిజ జనవరి 18 ప్రభాతవార్త :** మండల పరిధిలోని వెంకటాపురం గ్రామ స్టేజి సమీపంలో ద్విచక్ర వాహనం, టిప్పర్ ఢీకొనడంతో యపదిన్నే గ్రామనికి చెందిన దావీద్ అక్కడికక్కడే మృతి చెందారు. మిగతా ఇద్దరికీ తీవ్ర గాయాలు అవడంతో ఆసుపత్రికి తరలించారు. భారత్ మాల రోడ్డు నిర్మాణం కోసం మట్టి తరలింపు చేస్తున్న టిప్పర్ తో ఈ దుర్ఘటన జరిగింది. మృతి చెందిన దావీద్ బంధువులు గ్రామస్తులతో కలిసి ఘటన స్థలంలోనే రోడ్డుపై బైఠాయించి మాకు న్యాయం చేయాలని నిరసన తెలపడం జరిగింది.

**రోడ్డు ప్రమాదాల నివారణకు**

## పటిష్ట చర్యలు తీసుకుంటాం

**నారాయణపేట ఎస్పీ యోగేష్ గౌతమ్**

**మక్తల్, జనవరి 18 ప్రభాతవార్త:** జిల్లాలో రోజురోజుకు పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటామని నారాయణపేట జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ పేర్కొన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం మక్తల్ పట్టణంలోని రాయల్ ఫంక్షన్ హాల్ లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు, ప్రైవేటు వాహనాల డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాల పట్ల అవగాహన సదస్సుతో పాటు మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో చాలావరకు అమాయకులు బలవుతున్నారని అన్నారు. దీనివల్ల వారి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ వాహనాలు నడిపే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మద్యం సేవించి ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలను నడపరాదన్నారు. ట్రాఫిక్ రూల్స్‌ను ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాటించాలన్నారు. వాహనం ఫిట్నెస్‌తో పాటు డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ఆర్‌సి వంటి పత్రాలను తప్పనిసరిగా వాహనం వెంట ఉంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా వాహన డ్రైవర్లకు ఉచితంగా కంటి, ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డిఓ రామచందర్, డిఎంహెచ్ ఓ సౌభాగ్య లక్ష్మి, సిఐలు చంద్రశేఖర్, శివశంకర్, రాజేందర్ రెడ్డి, దత్రునాయక్, డిటిఓ మేఘా గాంధీ, ఎస్సైలు భాగ్యలక్ష్మిరెడ్డి, అశోక్ బాబు, నవీద్, కృష్ణంరాజు, వెంకటేశ్వర్లు, కుర్మయ్య, రాముడు, రాజు, రాము, రమేష్ తదితరులు పాల్గొన్నారు.